సాక్షి శ్రీకాకుళం

గురువారం । 11 । మే । 2023



ఫిర్యాదుల పరిష్కారానికి..

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుల పరిష్కారానికి నాలుగంచెల విధానం అమలు చేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

- 8లో



భూమికి సారం..

వేసవిలో మందకాపుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. గొర్రెలు, మేకల వ్యర్థాలతో భూమి సారవంతమవుతుంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	38°	26°
ఇచ్ఛాపురం	37°	26°
పాతపట్నం	37°	26°
శ్రీకాకుళం	37°	26°

న్యూస్‌రీల్

జూనియర్ మిస్ ఇండియాకు మంత్రి అభినందనలు



నైనిషాను అభినందిస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: జూనియర్ మిస్ ఇండియా బెస్ట్ పర్సనాలిటీ–2023 అవార్డు అందుకున్న పలాసకు చెందిన మల్లా నైనిషాని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అభినందించారు. పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నైనిషా బుధవారం మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. భవిష్యత్తులోనూ మరింతగా రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి సీదిరి శ్రీదేవి, తల్లిదండ్రులు సంతోషి, శరత్‌బాబు, మల్లా రామేశ్వరం పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్, టెక్కలి: పాలిటెక్నిక్ డిప్లమాలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పాలిసెట్ – 2023 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాకుళం, టెక్కలి కేంద్రంగా 48 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లా నుంచి 12481 మంది దరఖాస్తు చేసుకోగా 11178 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం పట్టణం కేంద్రంగా 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 7529 మందికి 6663 మంది పరీక్ష రాశారు. టెక్కలి కేంద్రంగా 16 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 4952 మందికి 4515 మంది హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, జిల్లా పరిశీలకులు డాక్టర్ కె.నారాయణరావు పరీక్షలు పర్యవేక్షించారు.

మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

గార: మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం బూరవెల్లి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటివరకు జరిగిన కొనుగోళ్ల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంచులతో పాటు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జెన్ని రామారావు, ఏఓ డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో బోధన



మాట్లాడుతున్న డీఈఓ తిరుమల చైతన్య

గార: ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన జరగాలని, పరిసరాలతో విద్యార్థులను అనుసంధానం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మూడు రోజులుగా వమరవల్లి డైట్‌లో డీఎస్సీ–1998, 2008 బ్యాచ్‌లకు చెందిన ఇటీవల ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులకు పరిసరాల విజ్ఞానంలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రస్థాయిలో ఎంపికైన రిసోర్సు పర్సన్ల శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ పరిసరాల విజ్ఞానం, స్వభావం, బోధనోపకరణాలు, సాంకేతిక వనరులు, ప్రణాళికలు వంటి 11 విషయాలపై శిక్షణ పొంది ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ, అధ్యాపకులు సూర్యప్రకాష్, ఎ.వేణుగోపాలరావు, సమన్వయకర్తలు పీవీఎస్ఎన్ మూర్తి, ఎల్.వెంకటాచలం, యు.సురేష్, ఏసీఈ లియాఖత్ ఆలీఖాన్, ఎస్ఈఆర్‌టీ జిల్లా పరిశీలకులు ప్రభాకర్, డీసీఈబీ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా సంబరం

- జిల్లాల్లో గ్రామదేవత పండగల సీజన్
- ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వేలాది మంది
- అతిగా తింటే అనర్థమే
- బాగా ఉడికిన మాంసాన్ని మాత్రమే తినాలంటున్న వైద్యులు
- జిల్లాలో మొదలైన డయేరియా, ఫుడ్ పాయిజన్ కేసులు
- వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో వడదెబ్బ తగిలే అవకాశాలు

జిల్లాలో ఎక్కడ చూసిన గ్రామదేవతల పండగ హడావిడే. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఒక ఎత్తయితే.. అతిథులకు భోజన ఏర్పాట్లు మరొక ఎత్తు. ఇంటికి వచ్చిన ఆడపిల్లలు, చుట్టాలు, బంధువులకు కమ్మని భోజనం ముఖ్యంగా మాంసాహారం పెట్టేందుకు పోటీపడుతుంటారు. వివిధ వెరైటీల్లో చికెన్, మటన్ కర్రీలు కళ్లముందు కనిపించేసరికి ఆవురావురుమని భోంచేస్తుంటారు. ఇక్కడే సంయమనం పాటించాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అసలే ఎండలు.. ఈ పరిస్థితుల్లో అతిగా మాంసాహారం తింటే ఇక్కట్లు తప్పవని హెచ్చరిస్తున్నారు.

అరసవల్లి:

ఇప్పుడు గ్రామదేవత సంబరాల సీజన్ నడుస్తోంది. మండుటెండల్లో అమ్మవార్లకు చల్లదనాలు చేసేలా అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు రణస్థలం వరకు దాదాపుగా అన్ని దిక్కుల్లోనూ వివిధ రూపాల్లో అమ్మవారిని కొలుస్తూ ఉత్సవాలు జరుపుకొంటున్నారు. 12 ఏళ్లకొకసారి, పదేళ్ల తర్వాత అంటూ చాలా చోట్ల ఈ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సంబరాల్లో భాగంగా అన్ని ప్రాంతాల్లోనూ అత్యంత ప్రాధాన్యత మాంసాహార భోజనాలకే



అని చెప్పవచ్చు. మేకలు, కోళ్లను పెద్ద సంఖ్యలో బలి ఇచ్చి..వాటి మాంసాన్ని భుజించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లో కూడా అమ్మవారి సంబరాలు జరుగుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన మన జిల్లా వాసులు, ఆయా గ్రామాలకు చెందిన వారు ఇప్పటికే సిక్కోలు చేరుకున్నారు. అయితే ఇష్టానుసారంగా ఆహారాన్ని తీసుకోకుండా ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ఆస్పత్రుల పాలవుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో కూడా జనం అప్రమత్తంగా ఉండాలని, లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



భోజనాలు చేస్తున్న జనం

అందుబాటులో సిబ్బంది..



జిల్లాలో సంబరాలు జరుగుతున్న ప్రాంతాల్లో ముఖ్యంగా ఇచ్ఛాపురం, పాతపట్నంలో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

నాణ్యమైన ఉత్పత్తులు మేలు..



వంటకు వాడే సరుకులను వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలవే వాడాలి. లూజ్‌గా దొరికే కారం, ఆయిల్స్, మసాలాలు కాకుండా సీల్ ప్యాకెట్స్‌గా ఉన్న ఐఎస్ఐ, ఆగ్ మార్కు ప్రొడక్ట్స్‌ను మాత్రమే వినియోగించాలి.

– కె.వెంకటరత్నం, జిల్లా ఆహార పరిరక్షక ప్రమాణాల శాఖాధికారి

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- మాంసాహార భోజనం విషయంలో అధికంగా తింటే అనర్థాలే. మాంసం బాగా ఉడకాలి. లేదంటే జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఉంటుంది.
- మాంసాహారం వంటల్లో అతిగా మసాలా వినియోగించకూడదు. మసాలా ఫుడ్స్ ఎక్కువ తినడంతో డయేరియా వచ్చే ప్రమాదముంది.
- వేసవిలో నాన్‌వెజ్, ఆయిల్ ఫుడ్ అధికంగా తినడం మంచిది కాదు.
- మటన్ హైప్రోటీన్ ఫుడ్ కావడంతో జీర్ణానికి చాలా సమయం తీసుకుంటుంది. పొట్టలో ఇబ్బందులుంటే తినడానికి సాహసించకూడదు.
- ఫుడ్ పాయిజన్ అయితే యాంటిబయాటిక్స్, ఫ్లూయిడ్స్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో డయేరియా, ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి.
- మాంసాహార భోజనాల్లో మటన్ కంటే చికెన్ బెటర్. మటన్‌లో హైప్రోటీన్, హై ఫ్యాటీ ఉంటుంది.
- హృద్రోగులు, ఆర్థో పేషెంట్స్ మాంసాహారం తినడం మంచిది కాదు. 45 ఏళ్లు దాటిన వారు కూడా పలు జాగ్రత్తలు తీసుకోవాలి.
- చేపలు కూడా బాగా ఉడకకుండా పులుసులా వండితే డయేరియా వస్తుంది.
- జన సందోహంతో పాటు వేసవి తీవ్రతతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. అలాగే వైరల్ జ్వరాలు పెరుగుతాయి.
- వడదెబ్బ తగిలితే వెంటనే గాలి బాగా ప్రసరించే ప్రాంతాల్లోకి తీసుకెళ్లాలి. మంచినీరు తాగించాలి. ఒళ్లంతా తడిగుడ్డతో వొత్తాలి..
- ప్రజలంతా ఎప్పటికప్పుడు కొబ్బరి నీరు, మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణాలు తాగాలి.
- జాతరల్లో సురక్షిత నీరు.. క్లోరినేషన్ నీటిని మాత్రమే వంటలకు వినియోగించాలి.
- సంబరాల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు తప్పనిసరి.
- వండిన ఆహారం బాగా ఉడికించాలి. అడుగు భాగం పాడైన అల్యూమినియం పాత్రల్లో వండకూడదు.
- ఆర్వో ప్లాంట్లలో ఉన్న ఐస్‌ను మాత్రమే వినియోగించాలి. బయట ప్రాంతాల్లోని ఐస్‌ను వాడితే వైరస్, బ్యాక్టీరియా రోగాలు వచ్చే అవకాశముంది.

● లక్ష పసుపు కొమ్ములతో అర్చన



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి బుధవారం లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. స్థానిక కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – కాశీబుగ్గ

● తెలంగాణ ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



పూజారి సిద్ధ్విని

ఆమదాలవలస రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఆమదాలవలస మండలం లొద్దలపేటకు చెందిన పూజారి సిద్ధ్విని హెచ్ఈసీ గ్రూపులో 475 మార్కులకు గానూ 468 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సిద్ధ్విని ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. తండ్రి ఏపీఎస్ఆర్‌టీసీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి ప్రయివేట్ స్కూల్ టీచర్. తల్లిదండ్రులు వృత్తిరీత్యా శ్రీకాకుళం నగరంలో నివాసముంటున్నారు.

వెంటాడిన మృత్యువు

- మహేంద్ర తనయ నదిలో కూరుకుపోయిన తండ్రీకొడుకులు
- కుమారుడి మృతి, తండ్రి పరిస్థితి విషమం



దున్న ప్రణయ్ మృతదేహం



గిరిజ తల్లిని ఓదారుస్తున్న బారువ సర్పంచ్ యర్ర రజనీ

సోంపేట : చాలాకాలం తర్వాత స్వగ్రామానికి వచ్చిన ఆ కుటుంబంపై విధి పగబట్టింది. ఒక్కగానొక్క కుమారుడ్ని తల్లిదండ్రులకు దూరం చేసి పుత్రశోకం మిగిల్చింది. ఈ విషాద ఘటన సోంపేట మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బారువ గ్రామానికి చెందిన దున్న చిరంజీవి అండమాన్‌లో వలస కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 12 ఏళ్ల కింద దామోదరపురం గ్రామానికి చెందిన గిరిజతో వివాహమైంది. పెళ్లయిన ఐదేళ్లకు కుమారుడు దున్న ప్రణయ్(7) జన్మించాడు. ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యులు, బంధువులతో గడిపేందుకు నెల రోజుల క్రితం చిరంజీవి కుటుంబంతో సహా బారువ చేరుకున్నారు. బుధవారం ఉదయం అత్తవారిల్లు దామోదరపురం వెళ్లేందుకు బస్సు కోసం బారువ బస్టాండుకు వచ్చారు. వీరు వచ్చే సమయానికి బస్సు వెళ్లిపోవడంతో మహేంద్ర తనయ నది గుండా నడిచి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గ్రామ సమీపంలోకి వచ్చేసరికి నదిలో గోతిలో తండ్రికొడుకులు కూరుకుపోయారు. వెనుకే ఉన్న తల్లి గిరిజ కేకలు వేయడంతో అదే గ్రామానికి చెందిన జి.హేమరాజు వచ్చి చిరంజీవిని, దున్న ప్రణయ్‌ను బయటకు లాగాడు. ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకోవడంతో గ్యాల్లారు సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందగా, చిరంజీవి పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలించారు. ప్రణయ్ తల్లి గిరిజ ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ప్రణయ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఉలిక్కిపడిన కోదడ్డపనస

- జంట హత్యలకు పాల్పడిన నిందితుడు ఆత్మహత్య
- వరుస మరణాలతో ఆయా కుటుంబాల్లో విషాదం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

సారవకోట:

ప్రశాంతంగా ఉండే కోదడ్డపనస గ్రామం వరుస హత్యలు, ఆత్మహత్యతో ఉలిక్కిపడింది. వివాహేతర సంబంధం మూడు కుటుంబాల్లో పెను విషాదం నింపింది. గ్రామానికి చెందిన అవివాహితుడైన ముద్దాడ రామారావు(32) అదే గ్రామానికి చెందిన వెలమల ఎర్రమ్మతో ఎనిమిదేళ్ల నుంచి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుండటం, ఇటీవల ఎర్రమ్మ అదే గ్రామానికి చెందిన ముద్దాడ సంతోష్‌తో చనువుగా ఉండటంతో మంగళవారం జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఈ దారుణానికి పాల్పడిన రామారావు సైతం గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రెండు హత్యలు చేసి పొలాల గుండా నడుచుకుంటూ వెళ్లిన రామారావు తొగిరి పంచాయతీ కొమ్మవలస సమీపంలో ఊరచెరువు వద్ద పంట పొలాల్లో తాను హత్యలకు వాడిన కత్తితోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం నిందితుడిని సెల్‌సిగ్నల్స్ ఆధారంగా వెతుకుతుండగా పెద్దన్నయ్య గణపతికి రామారావు మృతదేహం, కత్తి కనిపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించగా ఎస్పీ జీఆర్ రాధిక, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డిలు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



హత్యలకు, ఆత్మహత్యకు వాడిన వేట కత్తి

దివ్యాంగులకు వాహన యోగం



దివ్యాంగులకు మంజూరు చేసిన మూడు చక్రాల వాహనాలు

- జిల్లాలో 80 మందికి ఉచితంగా మూడు చక్రాల స్కూటీలు
- ప్రతి నియోజకవర్గానికి పది చొప్పున మంజూరు
- ఇప్పటికే ప్రారంభమైన పంపిణీ ప్రక్రియ
- తమ కష్టాన్ని గుర్తించారంటున్న లబ్ధిదారులు

నరసన్నపేట: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తూ బాసటగా నిలుస్తున్నారు. కాళ్లు పనిచేయక, చేతులు పనిచేస్తూ స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషిస్తున్న దివ్యాంగులకు, నిరుద్యోగ దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు ఉచితంగా మంజూరు చేశారు. 70 శాతం వైకల్యం కలిగి రెండు కాళ్లు పనిచేయక, రెండు చేతులు డ్రైవింగ్‌కు వీలుగా ఉండే వారిని గుర్తించి వారికి వీటిని పంపిణీ చేస్తున్నారు. ఒక్కో స్కూటీ ఖరీదు రూ.1.20 లక్షలు. జిల్లాలో 80 మందికి సుమారు రూ.82 లక్షలు వెచ్చించి మంజూరు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో 10 మంది చొప్పున ఎంపిక చేశారు. అర్హులైన లబ్ధిదారులు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండి ప్రభుత్వం నిర్ణయించిన అర్హతలు ఉంటే చాలు. స్కూటీలు మంజూరు చేశారు. అర్హతే ప్రామాణికంగా గుర్తించడంతో టీడీపీ సానుభూతిపరులకు కూడా మూడు చక్రాల స్కూటీలు మంజూరుకావడం విశేషం.

కష్టాలు గట్టెక్కాయి..

మాది పేద కుటుంబం. రెండు కాళ్లు పనిచేయడం లేదు. వలంటీర్‌గా జగనన్నే నాకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రి దయతో మూడు చక్రాల వాహనం మంజూరైంది. నా కష్టాలు గట్టెక్కాయి. చాలా ఆనందంగా ఉంది. వలంటీర్‌గా నా బాధ్యతలు మరింత సమర్థంగా నిర్వహిస్తా.

– సనపల ప్రభావతి, వలంటీర్, అల్లాడ, జలుమూరు మండలం

టీడీపీ అభిమానినైనా..



కరకవలస పంచాయతీకి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా. నేను టీడీపీ అభిమానిని. అయినా నా దివ్యాంగత్వాన్ని అర్హతగా భావించి మూడు చక్రాల స్కూటీ మంజూరు చేశారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందుతున్నాయనడానికి ఇదే ఉదాహరణ. ఉచితంగా రూ.1.20 లక్షల విలువైన స్కూటీ మంజూరు కావడం ఆనందంగా ఉంది.


– గురుబెల్లి రమణమూర్తి, సర్పంచ్, కరకవలస, జలుమూరు

జాబ్‌మేళా రేపు



జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి అధికారి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బలగ ఆస్పత్రి జంక్షన్‌లో డీఎల్‌టీసీ ఐటీఐ శిక్షణా కేంద్రంలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సేని హెవీ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఐదు సర్వీస్ ఇంజినీర్లు, ఒక పార్ట్స్ మర్చండైజర్ పోస్టులు భర్తీ చేస్తారని, ఐటీఐ, ఇతర విద్యార్హతలు కలిగిన 20–27 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు విశాఖ/విజయనగరం/ శ్రీకాకుళం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. మెడ్‌ప్లస్‌లో ఫార్మసిస్టు, ఫార్మఎయిడ్, సీఎస్ఏ, డెలివరీ బాయ్స్ వంటి 95 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటికి ఎంబీడీ, ఫార్మసీ, టెన్త్‌క్లాస్ విద్యార్హతలు కలిగిన 19–40 ఏళ్ల మధ్య వయస్సు గలవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు వీరఘట్టం/విశాఖపట్నంలలో పని చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఆసక్తి గల యువత బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో శుక్రవారం ఉదయం 10 గంటలకు డీఎల్‌టీసీ కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. ఎన్‌సీఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



క్లుప్తంగా

మహాయజ్ఞానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



మహాయజ్ఞం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

పాతపట్నం: దేవదాయ.. ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు అష్టోత్తరశత (108) కుండాత్మక చండీ, రుద్ర,రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞం జరగనుంది. మహాయజ్ఞానికి హాజరు కావాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి సంబంధిత ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు నీలమణిదుర్గ ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఆలయ సిబ్బంది సుదర్శనరావు ఎమ్మెల్యేను బుధవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా మహాయజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, బి.నారాయణమూర్తి ఉన్నారు.

అపురూపం.. వాసుదేవుని అలంకారం



దివ్యస్వరూపునిగా దర్శనమిచ్చిన వాసుదేవస్వామి

మందస: వాసుదేవుని దివ్యస్వరూపాన్ని భక్తులు కనులారా తిలకించి భక్తి తన్మయత్వానికి గురయ్యారు. వసంతోత్సవం అనంతరం వేదపండితులు బుధవారం స్వామిని దివ్యాంకృతునికావించారు. ఆనవాయితీగా వస్తున్న ఆభరణాల ధరింపజేశారు. శ్రీవాసుదేవస్వామి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంఘాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డీవీ కృష్ణారావు

జలుమూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆలిండియా సంఘం అధ్యక్షుడు డి.వి.కృష్ణారావు అన్నారు. జలుమూరులో సంఘ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. సంఘం అభివృద్ధి, ఎన్నికల నిర్వహణ, బ్యాంక్‌ఖాతా, రిజిస్ట్రేషన్ రెన్యువల్ తదితర విషయాలను చూడాలని పలువురు సభ్యులు కోరారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కృషి చేసిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలిమహంతి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.సుధాకరరావు, అడ్మిన్ కార్యదర్శి సదాశివుని కృష్ణ, కోశాధికారి బద్రి మహంతి వెంకట్రావు, విజయనగరం, విశాఖ, కృష్ణ జిల్లాల అధ్యక్షులు గిరీశ్వరరావు, ప్రభకరరావు, ఉమాశంకరరావు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్థానిక పీడీ, జిల్లా పీడీల అసోసియేషన్ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు శిబిరం కొనసాగుతోందన్నారు. సాయంత్రం వేళ నిర్వహించే శిబిరంలో సాఫ్ట్ బాల్ క్రీడలో మెలకువలు నేర్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	62,130-00
బంగారం(22సి. 10గ్రా.)	56,950-00
వెండి (కిలో)	82,700-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 490.00
విజయనగరం	రూ. 494.00
శ్రీకాకుళం	రూ. 494.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

భూమికి సారం.. వారికి జీవనాధారం!



పొలంలో మేత మేస్తున్న గొర్రెల మంద

- తక్కువ ఖర్చుతో ఎక్కువ భూసారం
- పర్యావరణ పరిరక్షణకు దోహదం
- మందకాపునకు వేసవి అనుకూలం
- సేంద్రియ ఎరువుగా గొర్రెలు, మేకల వ్యర్థాలు

జిల్లాలో పరిస్థితి ఇలా..	
మండలాలు	30
గొర్రెలు, మేకల పెంపకందారులు	17వేల కుటుంబాలు
గొర్రెలు	6,23,641
మేకలు	2,77,268

ఎల్.ఎన్.పేట: రైతులు తమ భూములను సారవంతం చేసేందుకు వివిధ పద్ధతలను అవలంబిస్తున్నారు. దీనికి వేసవి కాలాన్ని వినియోగించుకుంటారు. భూసారాన్ని పెంచేందుకు దోహదపడే వాటిలో రెండు పద్ధతులు పాటిస్తున్నారు. వీటిలో మొదటిది పొలాల్లో గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాపు కాయటం.. రెండోది చెరువు పూడిక మట్టి, కుళ్లిన గత్తంను పొలాల్లో వేయటం. ఈ రెండు పద్ధతులు పాటించిన పొలంలో సాగుచేసే పంటలు బాగా పండి అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొలంలో జీవాల మందల కాపు కాయటంతో వాటి వ్యర్థాలతో భూమి సారవంతం కావడంతో పాటు వాటి పెంపకందారులకు ఆదాయ మార్గంగా ఉంటుంది. జీవాల పెంపకందారులు కోటబొమ్మాళి, రణస్థలం, గార, ఎల్.ఎన్.పేట, టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, కొత్తూరు, మందస మండలాల్లో ఎక్కువగా ఉన్నారు.

తక్కువ ఖర్చుతో..

పగలంతా మేతకు వెళ్లిన గొర్రెలు, మేకల మందను రాత్రికి రైతు పొలానికి తీసుకొనివస్తారు. ఒక రాత్రి పొలంలో ఉంచటం వలన అవి వేసే పేడ (గత్తం) భూ సారం పెంచుతుంది. పొలంలో జీవాల మంద ఉంచేందుకు గాను వాటి యజమానులకు పది కుంచాల బియ్యం (30 కిలోలు), రూ.200 నగదు, కూరగాయాలు, చింతపండు, పప్పులు రైతులు ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపుకాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. భూసారం పెంచేందుకు, పర్యావరణ పరిరక్షణలోను మంద కాపుకాయటం ఎంతగానో దోహదపడుతుంది. పురుగు మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించవచ్చు.

వేసవిలో అనుకూలం..

వేసవిలో భూసారాన్ని పెంచేందుకు దోహదపడే వాటిలో గొర్రెలు, మేకల మందలను కాపుకాసేందుకు ఎంతో అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంట కోత తరువాత మందల కాపు కాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. దుక్కి సమయంలో గొర్రెలు, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. వీటి వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

ప్రోత్సహిస్తున్నాం



గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలు, ఇతర పథకాలు, బీమా వంటి అనేక సమాచారం తెలియజేస్తూ ప్రోత్రహిస్తున్నాం. జీవాల మందల వద్దకు వెళ్లి వాటి పెంపకంపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సీజన్ ప్రకారం వ్యాక్సినేషన్ వేస్తూ రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–ఎం.లోకనాథం, పశుసంవర్ధక శాఖ ఏడీఏ, కోటబొమ్మాళి

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపుకాయటం వలన భూసారం పెరుగుతుంది. ఎరువులు, పురుగు మందుల విని యోగం తగ్గుతుంది, విచక్షణా రహితంగా పురుగు మందులు, ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. సేంద్రియ పద్ధలు పాటించటం వలన భూమి పొరల్లో ఉంటే మిత్ర పురుగులు సంఖ్య పెరుగుతుంది. ఏటా మందల కాపుకాయటం వలన భూమి సారవంతంగా మారుతుంది. పంట కాలంలో రైతులకు పెట్టుబడి తగ్గుతుంది.

–పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ



మాకు సుమారు 150 వరకు మేకలు, గొర్రెలు మందగా ఉన్నాయి. పూర్వీకుల నుంచి మంద పెంపకం ఆనవాయితీగా ఉంది. మా నాన్న నుంచి నేను కూడా మంద పెంచటం నేర్చుకున్నాను. రోజూ నాతో పాటు మరో ఇద్దరు కలసి జీవాలను మేతకు తీసుకుని వెళతాను. పొలాల్లో మంద కాపు కాయటం వలన భూమికి ఎంతో మేలు జరుగుతుంది.

–బొమ్మాళి శిమ్మన్న, గొర్రెల మంద యజమాని, కృష్ణాపురం, ఎల్.ఎన్.పేట

19న బీఆర్ఆర్ శత జయంతి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బొడ్డేపల్లి రాజగోపాలరావు (బీఆర్ఆర్) శత జయంతి ఉత్సవాలను జిల్లాలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 19న బీఆర్ఆర్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శత జయంతి ఉత్సవాలపై బీఆర్ఆర్ కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్‌తో కలిసి స్పీకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. బి.సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. అప్పటి నుంచి నిర్వహించే కార్యక్రమాలు, ముగింపు రోజున బహిరంగ సభ తదితర వివరాలతో ముందుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అతి పెద్ద నీటిపారుదల ప్రాజెక్టు బీఆర్ఆర్ పేరుతో ఉందని, ఆ స్థాయిలోనే శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మాజీ మంత్రి బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, బి.సి.సంక్షేమ శాఖాధికారి ఇ.అనురాధ, బొడ్డేపల్లి గోవింద, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి నాలుగంచెల విధానం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వ్యక్తిగత ఫిర్యాదులకు, సమస్యలకు ప్రాధాన్యమిచ్చి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 52 శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదిక నుంచి పర్యవేక్షించి పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. ఇందు కోసం నాలుగు అంచెల విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్జీ నమోదు, విచారణ, సకాలంలో స్పందన, అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించుట అనే విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి అర్జీకి నంబరు కేటాయిస్తారని, మెసేజ్ ద్వారా సమాచారం వస్తుందని, దాని ద్వారా పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారు సంతృప్తి చెందకపోతే ఆ విషయం తెలుసుకునేందుకు రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలతో కలిసి ఆడిట్ బృందాన్ని, మండల స్థాయిలో పర్యవేక్షణకు ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం రాష్ట్రస్థాయిలో గత ఆరు నెలలుగా కొనసాగుతోందని గుర్తుచేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,857 మంది కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు చేశారని, అందులో రెండు వేల మంది కాల్స్‌కు సమాధానం ఇచ్చామని చెప్పారు. వారిలో 1,129 మంది సంతృప్తి చెందలేదని, ఆడిట్ టీమ్ ద్వారా వివరాలు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. 1,034 మంది తమ సమస్యల పరిష్కారం పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, మిగిలిన 95 మంది సమస్యలు పరిష్కార దిశలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 732 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, ఇందులో ఏడు వేల మంది సెక్రటరీలు, 13 వేల మంది వలంటీర్ల వ్యవస్థ ఉందన్నారు. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్నప్పుడు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకునేలా ఉండాలని, స్పందన కార్యక్రమానికి ఇది బూస్టర్ డోస్ వంటిదని చెప్పారు. 1902 నెంబర్ అందుబాటులోకి రాకపోతే, మెసెజ్ ద్వారా తెలియజేస్తే, తరువాత ఆ నంబర్‌కి ఫోన్ వస్తుందని తెలిపారు. జేసీ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ పాల్గొన్నారు.

రైతు సంఘాల బలోపేతానికి చర్యలు

- ఉద్యానశాఖ ఏడీ రత్నాచార్యులు



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాచార్యులు

కవిటి: రైతు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉద్యానశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీ రత్నాచార్యులు అన్నారు. రైతు సంఘాలకు ఇస్తున్న రాయితీల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్‌వీవీ ప్రసాద్‌తో కలిసి కవిటి మండలంలో నిర్మిస్తున్న హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ల నిర్మాణాల పురోగతిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 28 యూనిట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. వీటిలో 18 సెంటర్ల నిర్మాణం తుదిదశకు చేరిందన్నారు. ఒక్కో యూనిట్‌ను ఉద్యానశాఖ ద్వారా రూ.15 లక్షల వ్యయంతో నిర్మిస్తోందన్నారు. ఇందులో ప్రభుత్వం 75 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. అనంతరం మండల కొబ్బరి రైతుసంఘాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రైతు సంఘాలకు ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న వివిధ రాయితీ పథకాల్ని వివరించారు. హెచ్‌ఓ పోలాకి మాధవీలత, బోర్డ్‌ఆఫ్‌డైరెక్టర్స్ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

- టెక్కలి నూతన డీఎస్పీ బాలచంద్రారెడ్డి



బాలచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఐలు, ఎస్సైలు

టెక్కలి: టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తానని డీఎస్పీగా నియమితులైన డి.బాలచంద్రారెడ్డి వెల్లడించారు. కొత్తగా ఏర్పాటైన పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయానికి డీఎస్పీగా నియామకమైన ఆయన బుధవారం విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని టెక్కలి, పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట సర్కిళ్ల సీఐలు, ఎస్సైలు డీఎస్పీ బాలచంద్రారెడ్డికి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో డీఎస్పీ మాట్లాడుతూ.. టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సీఐలు చంద్రమౌళి, వినోద్, వేణుగోపాలరావు, రాము ఉన్నారు.

6 గంటలు పనిచేస్తేనే గిట్టుబాటు వేతనం

- డ్వామా పీడీ చిట్టిరాజు



బొంతుపేటలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

లావేరు: ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులు రోజుకు ఆరు గంటలు పనిచేస్తేనే గరిష్ట వేతనం 272 రూపాయలు వస్తోందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు జీవీ చిట్టిరాజు అన్నారు. లావేరు మండలంలోని శిగురుకొత్తపల్లి, బొంతుపేట గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఇంతవరకూ చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ.. గరిష్ట వేతనం పొందడమే లక్ష్యంగా పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారికి వంద రోజులు పనులు కల్పిస్తామన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున చల్లని సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలన్నా రు. నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. వేతనదారులందరూ పీఎంఎస్‌బీవై పథకం ద్వారా 20 రూ పాయలు చెల్లించి బీమా కట్టుకోవాలన్నారు. పీడీ వెంట ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఉపాధిహామీ పథకం మండల ఏపీవో ఆర్.సత్యవతి, జేఈ లెనిన్‌బాబు, టీఏ గౌరునాయుడు, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, శిగురుకొత్తపల్లి మాజీ సర్పంచ్‌లు మీసాల రామినాయుడు, కోనేటి శ్రీను, ఎఫ్‌ఏలు, మేట్‌లు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి



స్థల పరిశీలన చేస్తున్న పీవో కల్పనాకుమారి

సారవకోట: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనాకుమారి చెప్పారు. సారవకోట మండల కేంద్రంలో గిరిజన సామాజిక భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బుధవారం పరిశీలించారు. తొలుత మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లతో మండలంలో చేపడుతున్న పనుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జాతీయ రహదారికి అనుకుని కొండ పోరంబోకు స్థలాన్ని సామాజిక భవన నిర్మాణానికి కేటాయించారని.. అయితే ఈ స్థలం వివాదాస్పదంగా ఉందన్నారు. జేసీ, టెక్కలి సబ్‌కలెక్టర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి సారిస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. సారవకోట మండలంలో ఐటీడీఏ తరఫున పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. దీని కోసం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఎంఈవో ఎంవీ రమణ ఉన్నారు.

ఇందు ఉన్నత విద్యకు అండగా నిలుస్తాం



ఇందును అభినందిస్తున్న ఐక్యవేదిక నాయకులు

వజ్రపుకొత్తూరు: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 590 మార్కులు సాధించిన కొండప్ప ఇందు ఉన్నత విద్యకు మత్స్యకార ఐక్యవేదిక అండగా నిలుస్తోందని వేదిక నాయకుడు అంబటి ఆనంద్ అన్నారు. ఒంకులూరు గ్రామంలో ఇందుకు మత్స్యకార ఐక్యవేదిక నాయకులు బుధవారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. సివిల్స్ సాధనే లక్ష్యమని ఇందు తెలిపింది. దీంతో మంత్రి సీదిరి అప్పలరాజు సహకారం తీసుకుని ఆమె ఉన్నత విద్యకు తోడ్పాటు ఇస్తామన్నారు. మత్స్యకార ఐక్యవేదికకు చెందిన కొమర దేవరాజు, ఎన్.భగీరథ, తామాడ తులసీరావు, బి.సునీల్, బి.గణేష్, జి.బాలయ్య పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



పైల లక్ష్మి

జి.సిగడాం: మెట్టవలస గ్రామానికి చెందిన వివాహిత పైల లక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్థానిక పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పాగిరి శంకరరావు బుధవారం తెలిపారు. ఈ నెల తొమ్మితో తేదీన తెల్లవారుజాము నాలుగు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంత వరకు తిరిగి రాలేదని భర్త పైల రాము ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. లక్ష్మికి మతిస్థిమితం లేకపోవడంతో ఎటో వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్టు హెచ్‌సీ చెప్పారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామానికి చెందిన తురాలి ఢిల్లీశ్వరరావు సారా తరలిస్తూ పట్టుబడినట్టు ఎస్సై ఎస్.చిరంజీవి బుధవారం తెలిపారు. ఇతని వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఢిల్లీశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆటోబోల్తా పడి ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న లోకేష్

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గొప్పిలి సమీపంలోని జోన్నపల్లి గ్రామానికి చెందిన జి.లోకేష్, బి.కగేష్‌లతో పాటు మరో ముగ్గురు టెక్కలి వైపు ఆటోలో వస్తుండగా జాతీయ రహదారిపై ఏర్పడిన చిన్నగుంతను తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. లోకేష్, కగేష్ గాయపడగా.. మిగిలిన ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన ఇరువురిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సమోదు చేశారు.

వృద్ధుడికి గాయాలు

ఎల్.ఎన్.పేట: బొర్రంపేట వద్ద అలికాం–బత్తిలి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వలసపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు తాలాడ రాములును గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం రాములు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్నాడు. సరుబుజ్జిలి నుంచి హిరమండలం వైపు వస్తున్న వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన రాములును 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న గొండు సీతారాం

శ్రీకాకుళం (పిఎన్‌కాలనీ): వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ పిల్లలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఓబులేసు నేతృత్వంలో ప్రజారోగ్య విభాగం, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ ఉన్నతాధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వీధి, పెంపుడు కుక్కలకు సంబంధించి యానిమల్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. కుక్కల నియంత్రణకు 2001 సంవత్సరంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (డాగ్) రూల్‌ను రూపొందించారని గుర్తు చేశారు. వీధి కుక్కలు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు వేయడం, వీధి కుక్కల శుద్ధీకరణపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇప్పటివరకు నగరంలో కుక్కల పెంపకానికి ఎన్ని లైసెన్సులు జారీ చేశారని అడిగి తెలుసుకున్నారు. పెంపుడు కుక్క ఎవరినైనా కరిస్తే ఐపీసీ సెక్షన్ 289 ప్రకారం నిబంధనలు పాటించని సంబంధిత యజమానుపై కేసు పెట్టాలన్నారు. వీధి కుక్కల బారిన పడకుండా ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ కేటాయించాలని, కుక్కల దాడుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కుక్కలు కరిచి బాలలు తీవ్రంగా గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం వంటివి సంభవిస్తే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ.. నగరంలో వీధి, పెంపుడు కుక్కల దాడులు, స్వైర విహారం చేయకుండా అన్నిశాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు గన్నెప్పడు, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణారావు, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.వి.ఎస్.కృష్ణారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER
■ New Batches for All Competitive Exams. (EM) will start from 08/05/2023 @ 9 to 12 & 5 to 8 pm. SURYA ACADEMY, GURAJADA Road, Kota jn., Vizianagaram. Ph : 99490 03295 [V- 5914]

SITE FOR SALE
■ శ్రీకాకుళం టౌన్, APHB కాలనీ, TPM స్కూల్ దరి 5 1/2 సెంట్లు మరియు ఆరసవిల్లి లక్ష్మీనగర్‌లో 5 సెంట్లు స్థలం అమ్మకమునకు కలదు. సంప్రదించండి. సెల్: 9441440177 [S-771009]

BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9810515624, 8800496710 [DA-36266]

HEALTH CARE
■ మనోధైర్యాన్ని కల్పించబడును. కుటుంబ సమస్యలు, వ్యసనాలు, ఋణ బాధలు, చెప్పుకోలేని అనారోగ్య సమస్యలకు అతి ఆలోచనలతో నిద్ర పట్టని వారికి స్ఫూర్తి కౌన్సిలింగ్ సెంటర్‌లో కౌన్సిలింగ్ ఇస్తూ చక్కని పరిష్కార మార్గాన్ని చూపబడును. Opp: మహేంద్ర ఫైనాన్స్, పెద్దపాడు రోడ్, శ్రీకాకుళం. సెల్: 7893286255 [S-771005]

WANTED
■ Required Primary, Middile, High school - English, Maths, Science and IIT teachers for Reputed school in Palasa. Cont: 9494899637 [S-771008]

■ ప్రకాశం జిల్లా, ఒంగోలులో నారాయణ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ స్టాఫ్ M/F కావలెను. Q: 10th - MBA. జీతం + కమీషన్, భోజనం + ఫ్రీ రూమ్‌కలదు. ✆ 63046 42825, 77807 51944 [O-787138]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [H-793424]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995365999 [HA-143]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786248]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.